క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



రేగిడిలో ఆటోలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగిడి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని, నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలని ఎస్‌ఐ పి.నీలావతి ఆటో డ్రైవర్లను సూచించారు. మండలంలోని మజ్జి రాముడుపేట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్ల వద్ద వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు పలు సూచనలు చేస్తూ ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, డ్రైవర్లు నిబంధనలను అతిక్రమించకుండా వాహనాలు నడపాలన్నారు. లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హరిదాసు సందడి



రాజాం పట్టణంలో హరిదాసు సందడి

రాజాం: పట్టణంలో బుధవారం హరిదాసు సందడి చేశారు. పలువీధుల్లో హరినామ సంకీర్తనతో సంచరించారు. భక్తులు హరిదాసు కలశంలో బియ్యం, దక్షిణ వేసి భ భక్తిశ్రద్ధలతో బోగం చెల్లించారు. ఈ హరిదాసు కీర్తనలతో పట్టణంలో పండగ వాతావరం ముందే మొదలైంది.

ఎమ్మెల్సీ పరామర్శ



నాగభూషణంనాయుడు కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామానికి చెందిన శాసుబిల్లి నాగభూషణంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. నాగభూషణంనాయుడు భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు సుగుణాకర్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మండలంలో కందిశ గ్రామానికి చెందిన వంజరాపు సుందరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. సుందరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుమారుడు వంజరాపు అశోక్‌కుమార్, అప్పలనాయుడులను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, మామిడి జగన్నాథంనాయుడు, పాలవలస ధవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాజ్‌పేయి



రాజాం సిటీ: వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

రాజాం సిటీ: తనదైన శైలిలో దేశానికి సేవలందించిన దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శప్రాయుడని మానవతా సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. స్థానిక మానవతా సంస్థ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా దేశానికి సేవలందించిన వాజ్‌పేయిని నేటి తరం యువకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మక్క అప్పలనాయుడు, ఆర్‌వీజే నాయుడు, ఎ.వెంకటినాయుడు, పి.గౌరీశ్వరరావు, ఎల్.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి: పట్టణంలోని సీనియర్ బీజేపీ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని పల్లె వీధిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నామని చెప్పారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.9.100ల నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ జి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లె పండగ లక్ష్యం నెరవేరేనా..!

- జనవరి 10లోగా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారుల ఆదేశం
- అక్టోబరు 14న ప్రారంభమైన అభివృద్ధి పనులు
- ఇప్పటి వరకు 40 శాతం పనులు మాత్రమే పూర్తి
- బొబ్బిలి నియోజకవర్గంలో రూ.27.90 కోట్లతో 405 పనుల మంజూరు
- 158 పనులు మాత్రమే పూర్తి



రామభద్రపురంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అవసరమైన చోట డ్రైనేజీల వంటి మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు కేటాయించింది. సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో అక్టోబరు 14న పనులకు శ్రీకారం చుడుతూ ఒకేసారి భూమి పూజ చేశారు. అయితే పనులు డిసెంబర్ చివరి నాటికే పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించి పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశారు. పనులు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా నేటికి సుమారు 40 శాతం కూడా పూర్తికాని పరిస్థితి. ప్రస్తుతం సాగుతున్న తీరును చూస్తే లక్ష్యం పూర్తయ్యేలా కనిపించడం లేదు.

రూ.27.90 కోట్లతో 405 పనులు

బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు రూ.27.90 కోట్లతో 405 పనులు గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు 158 పనులు మాత్రమే పూర్తయినట్లు అధికార సమాచారం.సీసీ రోడ్లు, అవసరమైన చోట మాత్రమే డ్రైన్లు నిర్మిస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాల టీడీపీ నేతలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఇందులో 80 శాతం సీసీ రోడ్లు నిర్మాణానికే నిధులు కేటాయించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక పనులు పూర్తయిన రోడ్లను కచ్చితంగా 21 రోజుల పాటు క్యూరింగ్ చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో అన్ని రోజుల పాటు క్యూరింగ్ చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గుర్తించిన పనులు, కేటాయించిన నిధులు, పూర్తయిన పనుల వివరాలు

మండలం	నిధులు (రూ.కోట్లలో..)	గుర్తించిన పనులు	పూర్తయిన పనులు
రామభద్రపురం	రూ.5.13	80	51
బొబ్బిలి	రూ.8.08	114	42
బాడంగి	రూ.7.01	89	39
తెర్లాం	రూ.7.65	121	26

అక్టోబరు 14న ప్రారంభమైన పనులు

పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు వారం రోజుల పాటు విధి, విధానాలు పనుల గుర్తింపు ఎలా అనే అంశంపై ఈ ఏడాది ఆగస్టు 23న అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి గుర్తించిన పనులను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. ఈ ఏడాది అక్టోబరు 14 నుంచి నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల ద్వారా పనుల శంకుస్థాపనలకే రెండు వారాలు పట్టింది. నవంబరు నెల నుంచి పనులు చేపట్టినా యాభై శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

జనవరి 15వ తేదీలోపు పూర్తి చేస్తాం



పల్లె పండగ కార్యక్రమంలో చేపట్టిన సీసీ రోడ్లు పనుల పురోగతిలో ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 40 శాతం పూర్తయ్యాయి. జనవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఆయా మండలాల ఏఈలకు ఆదేశాలు జారీ చేశాం. సీసీ రోడ్లు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు పరిశీలిస్తున్నాం. నాసిరకమైన పనులు చేస్తే బిల్లులు నిలిపేస్తాం.

– వి.అప్పారావు, డీఈఈ, బొబ్బిలి

కూటమి నేతలు సూచించిన వారికే పనులు

పల్లె పండగ కార్యక్రమం పేరుతో అభివృద్ధి పనులు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉన్నాయి. ఆ పనులను ఎక్కడికక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన కూటమి నేతలకే పనులు కట్టబెట్టారు. చాలా గ్రామాల్లో సర్పంచులకు, ఎంపీటీసీలకు ఈ పనులు కేటాయించలేదు. దీంతో వారికి అనుభవం లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సామాజిక సేవతో మానసిక ప్రశాంతత

రేగిడి: సామాజిక సేవ చేయడంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో వెలసిన శ్రీరామ ధర్మ క్షేత్రంలో నిర్వాహకులు వారణాసి జగన్నాథ స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ బుధవారంనిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ చెట్లు ఫలాలను కాసి ఇతరులకు ఉపయోగపడుతున్నాయన్నారు. నదులు ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగ పడుతున్నాయని, గోవులు పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయన్నారు. మానవుని శరీరం కూడా పరుల కొరకు ఉపయోగపడాలని, మానవుడు పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదని, వెళ్లేటప్పుడు కూడా ఏమీ తీసుకువెళ్లడని వివరించారు. దేవుదలకు చెందిన గొర్లె దామోదర రావు, దశమంతుపురానికి చెందిన సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దే అవకాశం తహసీల్దార్లకు ఇవ్వాలి

బాడంగి: భూముల రీసర్వేలో చోటు చేసుకున్న తప్పులను సరిదిద్దే అవకాశం తహసీల్దార్లకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం జేసీ పరిధిలో ఉన్న సవరణ యాప్ తహసీల్దార్ యాప్ ద్వారా పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గతంలో రెవెన్యూ సిబ్బంది తెలియక చేసిన తప్పిదాలు తమకు శాపంగా మారాయని వాటిని సరిదిద్దే అవకాశం తహసీల్దార్లకు ఇస్తే తమకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. జిల్లాలో బాడంగి, రామభద్రపురం మండలాలను పైలట్ పథకంగా తీసుకొని రీసర్వే పూర్తి చేశారు. అయితే అప్పట్లో ఉన్నతాధికారుల మెప్పుకోసం త్వరితగతిన సర్వే చేయాలన్న ఆతృతతో ఏడాదిలోగానే 27 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు.

దీంతో జాయింట్ ఎల్‌పీఎంలు, తప్పుడు ఖాతాలు, పొంతన లేని సర్వే నంబర్లు రావడంతో ఆన్‌లైన్‌లో వన్ బీ సమస్య, రిజిస్ట్రేషన్ల సమస్య తలెత్తింది. వీటిని సరి చేసి సమస్య పరిష్కరించాలంటే తహసీల్దార్లకు తలకు మించిన భారంగా మారింది. ఈ విషయమై ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. కూటమి మళ్లీ రీసర్వేకు సిద్ధమవుతున్న వేళ తప్పులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రయాణంలో ఫీట్లు చేయాల్సిందే...



పట్టణంలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు విస్తరిస్తున్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఫీట్లు చేయాల్సిందే.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో గుంతలో నీటితో నిండిపోయి మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. – రాజాం

క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: మండలంలోని పెద్దమేడపల్లి గ్రామ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు జీవితం అందరికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆయన సూచించిన మార్గంలో నడిచి ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం పేదలకు వస్త్రాలతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఉప సర్పంచ్ మయూరి అప్పనాయడు, స్థానిక నాయకులు ఎం.సింహాచలం, దళిత నాయకులు జనార్దనరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి : అంబఖండి ఇమ్మానుయేలు చర్చిలో ప్రార్థనలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని క్రిస్మస్ పండగను అన్ని చోట్ల బుధవారం ఘనంగా జరిపారు. చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. వేకువజామున కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. వ్యాకోపాన్యాసం అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. పలు చర్చిల్లో ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: సెయింట్ లూథరన్ చర్చిలో వ్యాకోపాన్యాసం చేస్తున్న పాస్టర్



ఆర్‌సీఎం చర్చిలో బాలయేసు జనన ఇతివృత్తాంతం



సంతకవిటి: జి.ఎన్.పురంలో పేదలకు వస్త్రాల పంపిణీ



తెర్లాం:ఏసుక్రీస్తు జన్మదిన వృత్తాంతాన్ని తెలిపే నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు



వంగర: కింజంగి సీబీఎం చర్చిలో ప్రార్థనలు



రాజాం : వరలక్ష్మి సెయింటాన్స్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్యాలు



రాజాం సిటీ: గాయత్రి కాలనీలో హోసన్నచర్చి వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనలో విశ్వాసకులు

మురుగు, వ్యర్థాలతో సహవాసం



మురుగు కాల్వల మధ్య సచివాలయం



సచివాలయం పక్కనే ఉన్న వ్యర్థాలు

బొబ్బిలి రూరల్:

మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలోని సచివాలయ సిబ్బంది మురుగు, ఊరి బయట పడేసిన వ్యర్థాలతో సహవాసం చేస్తున్నారు. గ్రామంలో శివారున ఉన్న ఈ కార్యాలయం ఎన్నో సవాళ్లను, సమస్యలను పరిష్కరించినా అక్కడ పని చేస్తున్న సచివాలయ సిబ్బంది సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. అందరి సమస్యలను పరిష్కరించే సిబ్బంది వారి సమస్య పరిష్కారం కాకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. కార్యాలయం చుట్టూ తీవ్రమైన ధర్గంధం వెదజల్లుతోంది. అందునా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ఊరిలోని మురుగు, చెత్త అంతా ఆ కార్యాలయం చుట్టూనే పేరుకు పోయి ఉంది. దీంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలకు ఇదే పెద్ద సమస్యగా మారింది. సచివాలయానికి వెళ్లాలంటే రహదారి లేదు. ఆ మురుగు కాల్వ మీద ఉన్న చిన్న బల్ల చెక్క దాటి వెళ్లాల్సిందే. జారి పడితే మురుగు స్నానం చేయాల్సిందేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పార్వతిని అడగ్గా త్వరలోనే ఇక్కడ పక్కా కాలువ నిర్మాణం కానుందన్నారు. పక్కనే ఉన్న వ్యర్థాలపై ఆరా తీస్తే గ్రామస్తులకు చెబుతున్న చెత్త చెదరాలను ఇక్కడే వేస్తున్నారని, మా సూచనలను పెడచెవిన పెడుతున్నారని ఆవేదన చెందారు.

అన్నదాతలో తుఫాన్ ఆందోళన



వంగర: ఓనెఅగ్రహారం గ్రామంలో మొక్కజొన్న పంటలో చేరిన వర్షపు నీరు



రామభద్రపురం: పొలాల్లో ఉన్న వరి కుప్పలను కాపాడుకునేందుకు పరదాలతో కప్పిన రైతు



రామభద్రపురం: నీట మునిగిన పెసర పంట

రామభద్రపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస తుఫాన్ల కారణంగా మండలంలో కురుస్తున్న వర్షాలతో అన్నదాతలను ఆందోళన వీడడం లేదు. ఈ నెలలో వరు తుఫాన్‌లు ఏర్పడి అన్నదాతన కష్టాల్లో ముంచెత్తుతున్నాయి. పంట కోతలు కోసి పొలాల్లోనే కుప్పలు పెట్టారు. కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి పొలాల్లో ఉన్న వరి కుప్పలు సగం వరకు నీట మునిగాయి. పెసర, మినుము పంటలతో పాటు కూరగాయల పంటల్లో కూడా నీరు చేరడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే సమయంలో వరుస తుఫాన్‌లు కారణంగా దెబ్బతిని నష్టాలు బారిన పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

పంటలకు అపార నష్టం

వంగర: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు అపార నష్టం వాటిల్లుతోంది. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు నష్టం జరిగిందని మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు.